సాక్షి
కాకినాడ

శుక్రవారం | 10 | జనవరి | 2025

రుడా కార్యదర్శిగా సాయిబాబా


రాజమహేంద్రవరం సిటీ: మద్దిపాటి వెంకట రత్న సాయిబాబా రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన మంగళగిరి నుంచి ఇక్కడకు వస్తున్నారు.



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డి.శంకరీదేవి (విశాఖపట్నం) పేరిట ఆమె బంధువులు గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం



డి.పోలవరం, సర్పంచ్ సుభద్రమ్మ

తుని రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు తుని మండలం డి.పోలవరం సర్పంచ్ సీహెచ్ సుభద్రమ్మకు ఆహ్వానం లభించింది. ఎంపీడీఓ కె.సాయి నవీన్, ఈఓ పీఆర్‌డీ డి.మరిడియ్య గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది సర్పంచ్‌లకు ఆహ్వానం లభించగా.. వీరిలో మన జిల్లా నుంచి సుభద్రమ్మకు చోటు దక్కింది. ఎంట్రీ పాస్‌తో పాటు వసతి, భోజనం, రవాణా సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి లేఖ వచ్చిందన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న గృహ నిర్మాణ శాఖ పీడీ, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ


ప్రత్తిపాడు: పేదలకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. శ్లాబ్ దశకు చేరుకున్న గృహాల నిర్మాణాలను ఈ నెల 26 నాటికి పూర్తి చేయించాలని ఆదేశించారు. నియోజకవర్గ స్థాయి హౌసింగ్ అధికారులు, సిబ్బందితో ప్రత్తిపాడులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గానికి 5,752 ఇళ్లు మంజూరు కాగా 3,705 పూర్తయ్యాయని చెప్పారు. నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న 2,047 ఇళ్లను ఈ ఏడాది చివరికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి ఎంపీడీఓలు ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎస్ఎస్ఎస్ శర్మ, జి.శివరామకృష్ణయ్య, హౌసింగ్ ఈఈ కేవీఆర్ గుప్తా, డిప్యూటీ ఈఈ ఎ.రత్నరాజుతో పాటు నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లాలో 40,255 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లాలో ఈ ఏడాది 40,255 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ తెలిపారు. ప్రత్తిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు 68,651 ఇళ్లు మంజూరు కాగా, 28,396 పూర్తి చేశామన్నారు. 40,255 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.

రేపు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శనివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని గౌరీ శంకరుల ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఎడ్ల పరుగు పందాలు ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలు, షీల్డులు అందజేయనున్నామని వివరించారు.



పండగ వేళ.. కొత్త ముప్పు!

- హెచ్‌ఎంపీవీపై సర్వత్రా ఆందోళన
- అంత డేంజర్ కాదంటున్న నిపుణులు
- అయినప్పటికీ అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు



బాలిక ఆరోగ్య స్థితిపై సర్వే చేస్తున్న ఆశా కార్యకర్త



జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్‌ఎంపీవీ వార్డు

కాకినాడ క్రైం: కొత్త కొత్త వైరస్‌లు.. పుట్టుకొస్తున్న వేరియెంట్లు.. అవి మోసుకొస్తున్న రోగాలతో జనజీవనం అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ప్రజారోగ్య ముఖచిత్రం సమూలంగా మారిపోయింది. తుమ్మినా, దగ్గినా భయపడిపోయేంతగా పరిస్థితి దిగజారిపోయింది. చిన్నపాటి జ్వరం వచ్చినా రకరకాలుగా అనుమానించి.. పదుల సంఖ్యలో రక్త పరీక్షలు చేయక తప్పని దుస్థితి దాపురించింది. ఇటువంటి తరుణంలో కొత్తగా తెర మీదికి వచ్చిన హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) పట్ల సర్వత్రా ఆందోళన నెలకొంది. త్వరలో వరుస పండుగలు.. ఇదే సమయంలో హెచ్‌ఎంపీవీ వ్యాప్తి నేపథ్యంలో వైద్య, ఆరోగ్య వర్గాలకు కంటి మీద కునుకు కరవవుతోంది. ప్రజల్లోనూ ఒకింత భయాందోళన నెలకొంది. కొత్త వైరస్‌ను నియంత్రించడంతో పాటు, సామాజిక వ్యాప్తిని అరికట్టడానికి అధికారులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు.

ఏమిటీ వైరస్

హెచ్‌ఎంపీవీ ఓ శ్వాసకోశ వైరస్. చైనాలో పుట్టిందని చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో బెంగళూరు, అహ్మదాబాద్‌లో పిల్లలకు సోకిన ఈ వైరస్ మన దేశంలోనూ తన ఉనికిని చాటుకుంది. దీంతో వైద్య, ఆరోగ్య యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రస్తుతానికి మన రాష్ట్రంలోను, జిల్లాలోను ఈ వైరస్ ఉనికి లేనప్పటికీ వ్యాప్తి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. హెచ్‌ఎంపీవీని నిపుణులు కరోనా వైరస్‌తో పోల్చుతున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం, ఉనికిలో ఉన్న వేరియంట్ ఆధారంగా పరిశీలిస్తే ఈ వైరస్ కరోనా అంత ప్రమాదకరమైనది కాదని చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులపై దీని తీవ్రత ఆధారపడి ఉంటుంది. చలి కాలంలో ఈ వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని పల్మనాలజీ నిపుణులు చెబుతున్నారు. కరోనా కాదు.. ఫ్లూ కంటే కూడా హెచ్‌ఎంపీవీ తక్కువ ప్రభావవంతమైనదేనని అంటున్నారు. అయితే వేరియంట్‌లో మార్పులకు అనుగుణంగా తీవ్రరూపం దాల్చే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు.

ఇవీ లక్షణాలు

ఈ వైరస్ సోకిన వారిలో కోవిడ్ తరహా లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి ఉంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారు బ్రాంకైటిస్, న్యుమోనియా బారిన పడవచ్చు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైరస్ బారిన పడే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఈ వర్గాల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి.

ప్రత్యేక మందులేవీ లేవు

హెచ్‌ఎంపీవీకి ప్రత్యేకంగా మందులు, టీకాలు లేవు. లక్షణాల ఆధారంగా నిర్వహించే చికిత్స మాత్రమే దీనికి నేటి వరకూ ఉన్న మందు అని పల్మనాలజీ నిపుణులు చెబుతున్నారు. మందులతో పాటు ద్రవాలు, ఓఆర్ఎస్ ద్రావణాలు, విశ్రాంతి రోగికి అవసరమవుతాయి.

కోలుకోవడానికి 10 రోజులు

ఈ వైరస్ సోకితే లక్షణాలు బయటపడటానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. వైరస్ ప్రభావం నుంచి కోలుకోవడానికి ఏడు నుంచి పది రోజులు పడుతుంది. అయితే ఈ వ్యవధిలో గాని లేదా 10 రోజుల తర్వాత గానీ లక్షణాలు కొనసాగితే ఆసుపత్రిలో చేరడం, వైద్యుని సలహాలు అనుసరించడం తప్పనిసరి కావచ్చు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ జీజీహెచ్ ఈఎన్‌టీ భవంతిలో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి హెచ్‌ఎంపీవీ 22 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. దీనిని పల్మనాలజీ విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ప్రతి పడకకు ఆక్సిజన్ పాయింట్లు అందుబాటులో ఉంచారు. అలాగే, జిల్లావ్యాప్తంగా కాకినాడ జీజీహెచ్‌లో మాత్రమే హెచ్‌ఎంపీవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పండగ వేళ అప్రమత్తంగా ఉండాలి



పండగ వేళ రాకపోకలు, జనసమ్మర్దత నేపథ్యంలో హెచ్‌ఎంపీవీ వ్యాప్తికి అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ వైరస్ ప్రమాదకారి కాకపోయినా న్యుమోనియా వంటి ప్రాణాంతక స్థితికి దారి తీస్తుంది. కనీసం మరో మూడు వారాల పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సొంత వైద్యాలు, కాలం చెల్లిన సంప్రదాయ వైద్య విధానాలతో ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దు. వైరస్ బారిన పడితే శ్వాసకోశ సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. ఈ స్థితి ప్రాణాంతకం కావచ్చు.

– డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు, వైద్య విద్య విశ్రాంత సంచాలకుడు, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు

ఇవి వద్దు

- షేక్ హ్యాండ్ ఇవ్వడం.
- తరచుగా ముక్కు, నోటిపై చేతులు పెట్టుకోవడం, నలపడం.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మడం, మలమూత్ర విసర్జన.
- అనారోగ్యం బారిన పడి, ఇంట్లోనే సొంత వైద్యం చేసుకోవడం.

ఇవి మేలు

- రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆహారం తీసుకోవాలి.
- వైరస్ బారిన పడితే బయట తిరగవద్దు.
- బయటకు వెళ్లినపుడు మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.
- బయటి నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- శానిటైజేషన్, మాస్క్ ధారణ తప్పనిసరి కావాలి.
- తగిన విశ్రాంతి అవసరం
- గుంపులుగా ఉండే ప్రదేశాలకు వెళ్లొద్దు.

కట్టుదిట్టంగా చర్యలు



హెచ్‌ఎంపీవీని ఎదుర్కొవడానికి క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లూ చేశాం. కాకినాడ జీజీహెచ్ సహా ప్రతి సీహెచ్‌సీలో 3, పీహెచ్‌సీలో 1 చొప్పున ప్రత్యేక పడకలు సిద్ధం చేశాం. వీటికి ఆక్సిజన్ సరఫరా పటిష్టం చేశాం. నెబ్యులైజర్లు అందుబాటులో ఉంచాం. క్షేత్ర స్థాయి సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. అనుమానిత లక్షణాలున్నవారిని జీజీహెచ్‌కు పరీక్షల కోసం తరలిస్తున్నారు. అక్కడ వీడీఆర్ఎల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. డాక్టర్ రవికుమార్ నోడల్ అధికారిగా ఉండగా, ఎస్‌పీఎం విభాగ సమన్వయంతో జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. డూస్ అండ్ డోంట్స్ పోస్టర్లు అన్ని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నాం.

– డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కాకినాడ

ముక్కోటికి అంతా రెడీ!



తూర్పు రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన సత్యదేవుడు, అమ్మవారి నమూనా మూర్తులు

- రత్నగిరిపై పూర్తయిన ఏర్పాట్లు
- ప్రధానాలయంలో ఉత్తరాభిముఖంగా స్వామి దర్శనాలు
- ఉదయం 5 గంటలకు ప్రారంభం

అన్నవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినానికి రత్నగిరిపై అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రధానాలయం ఉత్తర ద్వారం వద్ద ఉత్తరాభిముఖంగా మండపం ఏర్పాటు చేసి, అందులో శేషపాన్పు మీద పవళిస్తున్న శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచ హారతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు. అనంతరం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించేందుకు భక్తులను అనుమతిస్తారు. సాయంత్రం 5 గంటల వరకూ భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయి. దీని కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ భక్తులు దిగువ నుంచి క్యూ ద్వారా ఆలయ ప్రాకారంలోకి ప్రవేశించాక దక్షిణ ద్వారం నుంచి లోపలకు వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు వస్తున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. అక్కడి నుంచి తూర్పు ద్వారం వైపు వెళ్లి, గర్భాలయంలో సత్యదేవుడు, అమ్మవారిని దర్శించి, దక్షిణ ద్వారం వద్ద ఉన్న క్యూ లైన్ల ద్వారా వెలుపలకు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం నుంచి రెండు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. దర్శనానంతరం భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ చేస్తారు.

సత్యదేవుని ప్రధానాలయంతో పాటు తూర్పు రాజగోపురం, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పువ్వులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. ఉత్తర ద్వార దర్శనాన్ని తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.



ప్రధానాలయంలో ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ

తూర్పు రాజగోపురం వద్ద కూడా..

ఈసారి తూర్పు రాజగోపురం సమీపాన కూడా స్వామి, అమ్మవార్ల నమూనా మూర్తులను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల వద్ద పూలకుండీలు పెట్టి, ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. భక్తులు ఈ నమూనా విగ్రహాల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే ఏర్పాటు చేశారు.

వెండి రథంపై ఊరేగింపు

స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఉదయం 11 గంటలకు వెండి రథంపై ఊరేగిస్తారు. దీని కోసం రథాన్ని పూలమాలలతో ముస్తాబు చేశారు. అలాగే, రాత్రి 7 గంటల నుంచి వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగిస్తారు.

టీటీడీ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: టీటీడీ నిర్వహణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని, రాజకీయాలు, ఆర్భాటాలు తప్ప దేనినీ పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో చోటు చేసుకున్న తొక్కిసలాటపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిరుపతి ఘటనపై కాకినాడ వైద్యనగర్‌లోని తన నివాసంలో గురువారం ఆయన సాక్షి మీడియాతో మాట్లాడారు. రాజకీయల కోసం దేవుడిని కూడా వదల్లేదన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామిని రాజకీయానికి వాడుకున్న ప్రభుత్వాన్ని చూశామని, వారి నిర్లక్ష్యానికి ఇప్పుడు ఆరుగురు భక్తుల ప్రాణాలు బలయ్యాయని అన్నారు. 2015 గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది చనిపోతే మృతుల కోసం చంద్రబాబు కనీసం ఒక్క నిమిషం కూడా బాధ పడినట్లు చూడలేదన్నారు. టీటీడీ చైర్మన్ వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నాయని, తొక్కిసలాటకు తప్పు వేంకటేశ్వరస్వామిదా అని ప్రశ్నించారు. తొక్కిసలాట బాధ్యత ఎవరు తీసుకుంటారని నిలదీశారు. ఇప్పటికైనా ప్రజల ముందుకు వచ్చి, దేవుడి ముందు తప్పు తమదేనని లెంపలేసుకోవాలని హితవు పలికారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలగా ఎంతసేపూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌ను తిట్టడం, శాపనార్థాలు పెట్టడం, వైఎస్సార్ సీపీని ఎలా అణచివేయాలా అని చూడటం, రెడ్ బుక్ రాజ్యాంగమని చెప్పి ఎవరిని పడితే వారిని అరెస్టు చేయడం వంటి పనుల పైనే దృష్టి పెట్టి, పాలన గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. టీటీడీ చరిత్రలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, దాదాపు 60 మంది గాయపడటం ఎప్పుడూ లేదని చెప్పారు. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్‌తో టీటీడీ ముడిపడి ఉందని, జరిగిన దారుణం, వైఫల్యంపై సమాధానం చెప్పాలని కన్నబాబు డిమాండ్ చేశారు.

టీటీడీ, ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట



మీడియాతో మాట్లాడుతున్న వంగా గీత

పిఠాపురం: వైకుంఠ ఏకాదశి దర్శనం టికెట్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు టీటీడీ పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. ఈ దుర్ఘటన ముమ్మాటికి టీటీడీ, ప్రభుత్వ వైఫల్యం వల్లనే జరిగిందని విమర్శించారు. పిఠాపురంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అనేక విమర్శలు చేశారని, లేనిపోని నిందలు వేశారని, అటువంటిది కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలాంటి సంఘటనలు జరుగుతూంటే మాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రత్యేక భద్రతా విభాగం, విజిలెన్స్ ఉన్న టీటీడీ ఇలాంటి సంఘటనను ఎందుకు అడ్డుకోలేక పోయిందని ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్న టీటీడీ ఎంత మంది వస్తారు, ఎలా వస్తారు, వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి, ఎలా అదుపు చేయాలనే విషయాలను ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవనే విషయం ఈ దుర్ఘటనను బట్టి అర్థమవుతోందని అన్నారు. చివరకు ప్రమాదం జరిగితే ఎలా కాపాడాలనే అంశాలను కూడా టీటీడీ, ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎలాంటి ముందుచూపూ లేకుండా ప్రభుత్వం ఉన్నట్లు తేటతెల్లమవుతోందన్నారు. బాధితులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, మెరుగైన వైద్యం అందించి, క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేసారు. తిరుపతి చరిత్రలో ఇప్పటి వరకూ ఇలాంటి దుర్ఘటన జరిగిన దాఖలాలు లేవని, కేవలం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని అన్నారు. క్షతగాత్రులను వేంకటేశ్వరస్వామి కాపాడాలని గీత కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, మొగలి అయ్యారావు, బొజ్జా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాండలీకాలను గ్రంథస్తం చేయిస్తాం

- తెలుగు భాషా వికాసానికి కృషి
- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న చైతన్యరాజు



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

రాజానగరం: దేశ భాషలందు తెలుగు లెస్స అని ఏనాడో కీర్తినందుకున్న మన మాతృ భాష పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు, భాషా వికాసానికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ)లో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పద్య, సాంఘిక నాటకాలను ప్రోత్సహించాలని, నంది నాటకోత్సవాలను కూడా పునరుద్ధరించదలచామని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన కాళీపట్నం రామారావు కథా నిలయం (ఉత్తరాంధ్ర), సీపీ బ్రౌన్ మందిరం (రాజమహేంద్రవరం)తో పాటు ప్రసిద్ధ గ్రంథాలయాలను సాంస్కృతిక పర్యాటకం అభివృద్ధిలో భాగంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తద్వారా అక్కడి గ్రంథాలను అధ్యయనం చేసే అవకాశం కలిగి, భాషా వికాసానికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని మాండలీకాలను గ్రంథస్తం చేయాలనే ఆలోచన ఉందని మంత్రి తెలిపారు. తెలుగు భాష వినియోగాన్ని పెంపొందించడంతో పాటు భావితరాలకు చేరువ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని దుర్గేష్ చెప్పారు.

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మాతృ భాషకు ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. తెలుగు భాష ఎంతో ప్రాచీనమైనదని, ఐతరేయ బ్రాహ్మణం, మహాభారతంలో కూడా ఆంధ్రుల ప్రస్తావన ఉందని చెప్పారు. దేశంలో ప్రాచీన హోదా కల్పించిన ఆరు భాషల్లో తెలుగు కూడా ఉందన్నారు. ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు ప్రపంచంలో 15, మన దేశంలో నాలుగు స్థానాల్లో ఉందని తెలిపారు. తెలుగు భాష గొప్పదనాన్ని ఇతర భాషీయులు గుర్తిస్తున్నారు కానీ, మనమే ఇంకా గుర్తించలేకపోతున్నామని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి తెలుగు విశిష్టత గురించి చెప్పారన్నారు. తుళు భాష మాట్లాడే శ్రీకృష్ణదేవరాయలే 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ఏనాడో చెప్పారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రజ్ఞావంతులైన పలువురిని ఘనంగా సన్మానించారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించేలా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని వివిధ కళాశాలల చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ద్విసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, కవి అందెశ్రీ, సినీ నటి హేమ, ఆస్ట్రేలియా తెలుగు సంఘం ప్రతినిధి కృష్ణ నడింపల్లి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో. చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కిమ్స్ ఎండీ కె.రవికిరణ్‌వర్మ, పలువురు కవులు, సాహితీవేత్తలు, సినీ కళాకారులు పాల్గొన్నారు.